www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 1 మే 2023

8 పేజీలు

ఏలూరు | పశ్చిమ గోదావరి







నేడే మేడే

- ఊరువాడా రెపరెపలాడనున్న ఎర్ర జెండాలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మేడే ఉత్సవాల్లో పది వేల మంది కార్మికులు
- ప్రదర్శనలతో హోరెత్తనున్న మండల, పట్టణ కేంద్రాలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై గళమెత్తనున్న కార్మిక లోకం
- హక్కులను కాలరాస్తూ, భద్రతను గాలికొదిలేయడంపై మండిపాటు
- పట్టణ కేంద్రాల్లో పాల్గొనున్న రాష్ట్ర, జిల్లా ముఖ్య నేతలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మేడే సంబరాలకు ఉమ్మడి జిల్లాలోని కార్మిక సంఘాలన్నీ సమాయత్తమయ్యాయి. సోమవారం జిల్లావ్యాప్తంగా మేడే ఉత్సవాలు అంగరంగవైభవంగా జరగనున్నాయి. కార్మిక దినోత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించేందుకు, ప్రభుత్వ కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలపై గర్జించేందుకు కార్మికులంతా ఒక్కటై చేయిచేయి ముందుకు సాగనున్నారు. సోమవారం అన్ని పట్టణ, మండల కేంద్రాల్లోనూ జెండావిష్కరణలు, ప్రదర్శనలు, సభలు పెద్దఎత్తున సాగనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు పది వేల మంది కార్మికులు మేడే సంబరాల్లో పాల్గొనున్నారు. జిల్లా కేంద్రాలు ఏలూరు, భీమవరంతోపాటు తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, పాలకొల్లు, జంగారెడ్డిగూడెం తదితర కేంద్రాల్లో భారీ ర్యాలీలు, సభల నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. పారిశ్రామిక వాడలు, పరిశ్రమల ప్రాంతాలతో పాటు పట్టణ, మండల కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలో ఎర్రని తోరణాలు కట్టి అలంకరించారు. సభలు నిర్వహించే ప్రాంతాల్లో కార్మికుల నినాదాలు, డిమాండ్లతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఉదయమే కార్మికులంతా తమ పని ప్రదేశాల్లో కార్మిక జెండావిష్కరణలు చేయనున్నారు. అనంతరం నిర్ణీత ప్రాంతానికి చేరుకుని ఆయా పట్టణాల్లో ప్రధాన వీధుల గుండా ప్రదర్శనలు, సభలు నిర్వహించనున్నారు. ఈ సభల్లో రాష్ట్ర, జిల్లా ముఖ్య నేతలతోపాటు ఇతర ప్రముఖులు సైతం పాల్గొనున్నారు. ప్రతి పరిశ్రమ వద్ద కార్మికులు మేడే సంబరాలు నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. మేడే సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పట్ల వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ కార్మికులు నినదించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడంతో కార్మికుల ఉపాధి, ప్రాణాలకు భద్రత లేకుండాపోయింది. పరిశ్రమల్లో తనిఖీలు అనేవి లేకుండాపోయాయి. కార్మిక, ఫ్యాక్టరీ శాఖలను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసిన పరిస్థితి నెలకొంది. తనిఖీలు లేకపోవడంతో పరిశ్రమల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో పరిశ్రమల్లో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారిపోతున్నాయి. ఏలూరు జిల్లాలో గడిచిన ఏడాదిలో ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం, పోలవరం ప్రాజెక్టు, సగ్గొండ, భీమడోలు, తాడేపల్లిగూడెం, భీమవరం తదితర ప్రాంతాల్లోని పరిశ్రమల్లో చోటుచేసుకున్న ప్రమాదాల్లో సుమారు 25 మందికిపైగా కార్మికులు మృత్యువాతపడ్డారు. దీంతో ఆయా కుటుంబాలు కుటుంబ యజమానిని కోల్పోయి రోడ్డున పడ్డాయి. కార్మిక సంఘాల పోరాటంతో కొంత ఆర్థికసాయం అందినప్పటికీ ఆయా కుటుంబాలు ఇంటి పెద్దదిక్కును కోల్పోయాయి. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు ఉద్యోగ, ప్రాణ భద్రత తామరాకుపై నీటిబొట్టులా మారింది. ఈ కాలంలో ఏలూరులో జ్యూట్‌మిల్లు, భీమవరం ప్రాంతంలో పేపర్‌మిల్లు మూతపడి వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డా ప్రభుత్వంగాని, ప్రజా ప్రతినిధులుగాని పట్టించుకున్న దాఖలాల్లేవు. భవన నిర్మాణం, ట్రాన్స్‌పోర్ట్, మాల్స్, విద్యాసంస్థలు, ఆసుపత్రులు వంటి రంగాల్లో లక్షల సంఖ్యలో కార్మికులు పని చేస్తున్నారు. వీరికి కనీస వేతనాలుగానీ, కార్మిక చట్టాలుగానీ అమలు కావడం లేదు. ప్రభుత్వాల తీరుతో అంగన్‌వాడీ, ఆశ, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ హక్కుల కోసం రోడ్డెక్కుతున్నారు.

అడుగడుగునా నిర్బంధం

ప్రజాస్వామిక హక్కులను ..6లో



కోలాటంలో ఫ్లూట్ వాయిస్తున్న ఎంఎల్‌సి సాబ్జీ

కనులవిందుగా హేలాపురి వేసవి ఉత్సవం

వివరాలు మెయిన్, లోపలి పేజీల్లో

ఆగని వర్షం.. ఆందోళనలో రైతాంగం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉదయం ఎండతీవ్రత కొద్దిసేపు ఉన్నా తర్వాత ఆకాశం మేఘావృతమైంది. మధ్యాహ్నం నుంచి ఏలూరు జిల్లాలో పలుచోట్ల ఈదురుగాలులతో భారీ వర్షం కురవగా, పశ్చిమగోదావరి జిల్లాలో అక్కడక్కడా చిరుజల్లులు పడ్డాయి.

ముదినేపల్లి: మండల కేంద్రమైన ముదినేపల్లితోపాటు పలు గ్రామాల్లో ఆదివారం వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 గంటల తర్వాత గంటకుపైగా వర్షం పడింది. ఉదయం ఏడు గంటలకే భానుడు భగభగలతో అల్లాడిన జనం వర్షం రాకతో హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు. అసలే వేసవిలో విద్యుత్ కోతలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజానీకం వాతావరణం ..6లో

కలిసొచ్చినా.. విడివిడిగా వచ్చినా గెలిచేది వైసిపినే

డిప్యూటీ సిఎం, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రానికి ఎల్లో వైరస్ సోకబోతోందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, లేకపోతే నష్టపోతామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు, పవన్ కలయిక అపవిత్రమని చెప్పుకొచ్చారు. చంద్రబాబును వదిలితేనే జనసేనకి భవిష్యత్ ఉంటుందని, పవన్ కల్యాణ్‌కు ఎదుగుదల ఉంటుందని సూచించారు. లేనిపక్షంలో అభిమానులకు కాపు సామాజిక తరగతికి పవన్‌కళ్యాణ్ అన్యాయం చేసిన వ్యక్తిగా చరిత్రలో మిగిలిపోతారన్నారు. అందరూ కలిసి పోటీ చేసినా, విడివిడిగా పోటీ చేసినా రాబోయే ఎన్నికల్లో గెలిచేది మాత్రం వైసిపి అని, కాబోయే ముఖ్యమంత్రి మళ్లీ జగనేనని కొట్టు సత్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీకి గత ఎన్నికల్లోనే ప్రజలు బుద్ధి చెప్పారని, అయినా ఇంకా జ్ఞానోదయం కాలేదన్నారు. 2024 ఎన్నికలు ఆ పార్టీకి చివరి ఎన్నికలని ఆ తర్వాత అంతరించడం ఖాయమన్నారు. ఏదోలాగా టిడిపిని బతికించుకోవాలని చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారన్నారు. అందులో భాగంగానే పవన్‌కళ్యాణ్‌తో పొత్తుకు చంద్రబాబు తహతహలాడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు, పవన్, పచ్చ మీడియా కలిసి కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వంలో జగనన్న సంక్షేమ పాలనలో ప్రజలంతా ఎంతో సంతోషంగా, ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. ఇదిచూసి తట్టుకోలేని ప్రతిపక్ష పార్టీలు ప్రజల మనసులను, ఆలోచనలను కలుషితం చేసే విధంగా రకరకాల దుష్ప్రచారాలు సాగిస్తున్నాయని విమర్శించారు. వచ్చేది ఎన్నికల ఏడాది కాబట్టి రాష్ట్రమంతా ఎల్లో వైరస్‌లా సోకి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను రద్దుచేసి ప్రజలను మళ్లీ కష్టాల్లోకి నెట్టాలని పెద్దఎత్తున కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. కాపు సామాజిక తరగతికి ఆనాడు వైఎస్.రాజశేఖర్ రెడ్డి, నేడు జగన్ న్యాయం చేశారన్నారు. ఐదు మంత్రి పదవులు, ఒక ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చి కాపు సామాజిక తరగతికి పెద్దపీట వేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షులు గుండుబోగుల నాగు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కొలుకులూరి ధర్మరాజు, వైసిపి యువనాయకులు కొట్టు విశాల్, బొద్దాని శ్రీనివాస్, ఆకుల ధనశేఖర్ పాల్గొన్నారు.


సాయం చేస్తున్న దాత

మృతుని కుటుంబానికి సాయం


ప్రజాశక్తి - ముదినేపల్లి

ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన కృష్ణాజిల్లా గుడివాడ రూరల్ మండలం వలివర్తిపాడుకు చెందిన లారీ డ్రైవర్ రామ్‌ప్రసాద్(42) కుటుంబానికి అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి ఆర్థికసాయం తన తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా ఆదివారం అందించారు. వలివర్తిపాడు వెళ్లి మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆనంతరం మృతుని భార్య నాగజ్యోతికి రూ.ఐదు వేల నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. పిల్లల చదువులకు తనవంతు సాయం చేస్తానని మనోజ్ తెలిపారు.

పెద్దలకు, తల్లిదండ్రులకు యువత గౌరవం ఇవ్వాలి

ప్రజాశక్తి- భీమడోలు

ఉన్నత స్థానాలకు ఎదిగిన యువత పెద్దలకు, తల్లిదండ్రులకు తగిన గౌరవం ఇవ్వాలని గురుకుల పాఠశాల రిటైర్డ్ ఉపాధ్యాయులు ఈతకోట సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాన నిర్వాహకులుగా భీమడోలు కేంద్రంగా నైతిక మానవ విలువల చర్చా వేదికను ఏర్పాటు చేశారు. స్థానిక సత్యేంద్ర పబ్లిక్ పాఠశాల ఆవరణలో ఆదివారం ఈ వేదికను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వైఆర్‌కె.శర్మ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చర్చావేదిక ప్రధాన నిర్వాహకులు ఈతకోట సుబ్బారావు మాట్లాడుతూ ప్రతీఆదివారం ఉదయం పది గంటల నుంచి 11 గంటల వరకూ సత్యేంద్ర పబ్లిక్ స్కూల్లో చర్చావేదిక నిర్వహిస్తామన్నారు. దీనిలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని నైతిక మానవ విలువల గురించి వివరిస్తారన్నారు. దీనిలో భాగంగా తల్లిదండ్రులను ఏ విధంగా చూసుకోవాలి, గురువులతో, పెద్దలతో ఏ విధంగా వ్యవహరించాలి, తోటివారిని ఆదరించడంతోపాటు పొరుగువారితో ఏ విధంగా స్నేహపూర్వకంగా నడుచుకోవాలి, అధికారులతో ఎలా మాట్లాడాలి వంటి అంశాలపై చర్చ ఉంటుందన్నారు. దీనిలో పాల్గొన్న వారికి భోధకులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ మండల విద్యాశాఖాధికారి పమ్మి కోదండరాం, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాలేటి బ్రహ్మారావు, గంధం వెంకట్రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈతకోట సుబ్బారావు


ధాన్యం రాశిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ధాన్యం రాశుల పరిశీలన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అకాల వర్షాలకు తడిసిన వరిపంటను, ధాన్యం రాశులను మండల వ్యవసాయాధికారి కెఎన్‌వి.పోశారావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 6,300 ఎకరాల్లో వరిపంట సాగు చేశారని తెలిపారు. ఇప్పటి వరకూ 1050 ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయని తెలిపారు. ఇప్పటివరకూ కోసిన పంటలో 350 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. పంట వర్షాల బారినపడకుండా తమ ధాన్యాన్ని టార్పాలిన్లు, బరకాలతో కప్పి ఉంచాలని తెలిపారు. అలాగే రానున్న మూడు, నాలుగు రోజుల్లో ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని, రైతులందరూ అప్రమత్తమై ధాన్యం తడిసిపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

స్థానిక శనివారపుపేట ఎంపియుపి స్కూల్ (ఉర్దూ) వార్షికోత్సవం పాఠశాల ఆవరణలో ఆదివారం ఘనంగా జరిగింది. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు ముఖ్యఅతిథిగా ఎంఇఒ సబ్బితి నరసింహమూర్తి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు చేసి అలరించారు. వివిధ ఆటలపోటీల్లో విజేతలకు బహుమతులను ఎంఇఒ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్ద కాలీషా, హెచ్‌ఎం.వహీదాబేగం, షకీలా పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం

చేబ్రోలు పిహెచ్‌సి వైద్యులు కె.సుబ్బరాజువర్మ

చిట్‌చాట్



ప్రజాశక్తి - ఉంగుటూరు

వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని చేబ్రోలు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కె.సుబ్బరాజువర్మ సూచించారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు.

ప్రశ్న : పిహెచ్‌సి పరిధిలో ఎన్ని గ్రామాలున్నాయి? సేవల వివరాలు చెబుతారా?

చేబ్రోలు పిహెచ్‌సి పరిధిలో 12 సచివాలయాల పరిధిలో 15 గ్రామాలున్నాయి. 32,500 మంది జనాభా ఉన్నారు. ఆరు ఆరోగ్య ఉపకేంద్రాల ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నాం..

ప్రశ్న : కోవిడ్ నిర్ధారణ పరీక్షలు ఎలా నిర్వహిస్తున్నారు? వాటి వివరాలు ఏమిటి?

ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి పిహెచ్‌సిలో రోజుకు పది మంది జ్వర పీడితులు, దగ్గు, వైరల్ ఫీవర్ అనుమానితులకు ర్యాపిడ్ టెస్టులు నిర్వహిస్తున్నాం. అందులో పాజిటివ్ వచ్చిన వారికి తిరిగి విఆర్‌డిఎల్ పరీక్షకు శాంపిల్స్ పంపించి అందులో వచ్చిన ఫలితాలను బట్టి కోవిడ్ నిర్ధారణ చేస్తున్నాం. ప్రస్తుతానికి కరోనా కేసులు లేవు.

ప్రశ్న : ఎక్కడైనా సిబ్బంది కొరత ఉందా?

ఆరు సబ్ సెంటర్లలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, హెల్త్ సూపర్‌వైజర్లు సరిపడా ఉన్నారు. నారాయణపురంలో ఆశా కార్యకర్తల ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది.

ప్రశ్న : విలేజ్ హెల్త్ క్లినిక్ పనితీరు ఎలా ఉంది?

రామచంద్రపురం, యర్రమిల్లిపాడులో ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించి అందులో స్టాఫ్, వ్యాధి నిర్ధారణ పరికరాలను ఉంచారు. వాటిసాయంతో ప్రతిరోజూ వందలాది మందికి షుగర్, బీపీ, నీరుడు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తున్నాం. మిగతా గ్రామాల్లో పంచాయతీల ఆధీనంలో అద్దె లేదా సామాజిక భవనాల్లో ఎంఎల్‌హెచ్‌పిలు సేవలందిస్తున్నారు.

ప్రశ్న : అవుట్ పేషంట్స్ స్పందన ఎలా ఉంది?

ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలు, వసతులు, ఔషధాలు, పరికరాలు అందుబాటులో ఉండటంతో రోజుకీ వంద నుంచి 120 మంది వరకూ ఓపీ ఉంటోంది. ప్రతీమూడు నెలలకు (క్వార్టర్) రూ.లక్షలాది ఔషదాలను ఇండెంట్ ద్వారా తెప్పిస్తున్నాం. మందుల కొరత లేదు.

ప్రశ్న : అత్యవసర కేసులు సంగతి?

పిహెచ్‌సి అయినప్పటికీ పాముకాటు, కుక్క కాటు బాధితులు ఏ సమయంలో వచ్చినా వెంటనే వైద్యసేవలు అందిస్తున్నాం. ఇంకా అత్యవసరమైతే వెంటనే అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పంపిస్తున్నాం. మా సిబ్బంది ఎంతో అంకిత భావంతో సేవా ధృక్పథంతో పనిచేయడం సంతోషంగా ఉంది. మౌలిక వసతుల కల్పన, వైద్యసేవలు అందిస్తున్నందుకు ప్రభుత్వం బెస్ట్ పిహెచ్‌సిగా అవార్డు అందించడం గర్వకారణంగా ఉంది. తామంతా బాధ్యతగా సేవే లక్ష్యంగా పనిచేస్తున్నాం. మా సొంతూరు నారాయణపురం కావడంతో ఎల్లవేళలా రోగులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నాను.


సంతాపం తెలుపుతున్న ప్రముఖులు

భైరవపట్నం సర్పంచికి మాతృవియోగం

మండవల్లి:భైరవపట్నం సర్పంచి పనుకుమాటి సామ్రాజ్యవాణికి మాతృవియోగం కలిగింది. ఆమె తల్లి బేతాళ అన్నమ్మ(86) గత కొద్దికాలం నుండి అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందారు. ఈ సంఘటనతో సర్పంచి కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అన్నమ్మ పెద్ద కుమార్తె సిస్టర్ గా, కుమారుడు రత్నకుమార్ లెక్కల టీచర్‌గా, సులోచన లెక్చరర్‌గాను, సామ్రాజ్యవాణి భైరవపట్నం సర్పంచిగా ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరావు తనయుడు దూలం వినయ్‌కుమార్, ఆర్‌సిఎ చర్చి పాస్టర్ నూతనపాటి కిషోర్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, టి.అప్పారావు, ఉపాధ్యాయులు కె.సూర్యారావు, పిఎల్.నరసింహారావురెడ్డి, గ్రామ ప్రముఖులు, భైరవపట్నం చేరుకుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

నిత్యాన్నదానానికి విరాళం

ముదినేపల్లి: సింగరాయపాలెంలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో జరిగే నిత్యాన్నదానానికి దాత ఆదివారం విరాళం అందించారు. ముదినేపల్లికి చెందిన ఈడ్పుగంటి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు ఈడ్పుగంటి ప్రభుశేషు రూ.10,116 విరాళంగా ఆలయ సిబ్బందికి అందచేశారు.

శతాధిక వృద్ధురాలు మృతి



పెనుగొండ:మండలంలోని సిద్ధాంతం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు దేవాని ముత్యాలమ్మ(103) వయోభారంతో మృతి చెందింది. సిద్ధాంతం హైస్కూల్ స్వీపర్‌గా పని చేస్తున్న ఆమెకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు, ఆరుగురు మనవరాళ్లు, 11 మంది మునిమనవరాళ్లు ఉన్నారని బంధువులు తెలిపారు.


ఆక్వా చెరువు అక్రమతవ్వకాలు ఆపాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

వైవాక గ్రామంలో అనుమతులు లేకుండా తాగునీటి చెరువు సమీపంలో చేపట్టిన ఆక్వా చెరువు తవ్వకం పనులు ఆపాలంటూ గ్రామ దళితులు కోరుతున్నారు. అక్రమ తవ్వకాల కారణంగా ప్రజలకు తాగునీటిని అందించే చెరువు కలుషితమవుతుందని అవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆదివారం విలేకరులకు సమస్యను వివరించారు. వైవాక తాగునీటి చెరువులోకి పంటబోదె ద్వారా నీటిని నింపుతారన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన అడుసుమిల్లి సుబ్బారావు ఆసామి, అతని కుటుంబ సభ్యులు నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా చెరువు తవ్వుతున్నారన్నారు. ఆక్వా చెరువు తవ్వకం వల్ల గ్రామ తాగునీటి చెరువుకు వచ్చే పంట బోదె కలుషితమై తాగునీటి వనరు పాడైపోతుందన్నారు. ప్రస్తుతం చేపల చెరువుగా తవ్విన తర్వాత రొయ్యల చెరువుగా మార్చి ఉప్పుకట్టలు, పలు రకాల రసాయనాలు తెచ్చి చేపల చెరువు నీటిలో కలపుతారని, దీనివల్ల ఆక్వా చెరువు మరింత విషతుల్యమవుతాయని తెలిపారు. చెరువులోని ఊట పంటబొదెలోకి దిగడంతో ఆ నీరు పశువులు, గొర్రెలు, మేకలు తాగి పారుడు వ్యాధి వచ్చే ప్రమాదం ఉందన్నారు. అంతేకాక చేపల చెరువు ఊట పంట బొదెలోకి చేరి సాగునీరు కూడా కలుషితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దీనిపై తహశీల్దార్‌కు, కలెక్టర్‌కు స్పందనలో ఆర్జీలు సమర్పించామన్నారు. అయినప్పటికీ అధికారులు నేటికీ ఏలాంటి చర్యలూ తీసుకోలేదని వాపోయారు. అధికార పార్టీ నేతలు చెరువు తవ్వే వ్యక్తి వెనుక ఉండి తవ్వకాలు సాగిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. కలెక్టర్ స్పందించి ఆక్వా చెరువు తవ్వకందారునిపై చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామంలోని తాగునీటి చెరువు కలుషితం కాకుండా కాపాడాలని వైవాక గ్రామస్తులు యాకోబు, ముత్యాల బాబూరావు, బి.రాంబాబు, గ్రామస్తులు కోరుతున్నారు.



అక్రమంగా తవ్వుతున్న చేపల చెరువు



అడ్మిషన్ స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

తోటపల్లిలో బడిబాట

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం తోటపల్లి ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది బాల, బాలికలను రాబోయే విద్యా సంవత్సరానికిగానూ అడ్మిషన్లు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.జ్ఞానసుందరం, కె.సువార్తరాణి, జి.అపర్ణ, ఎస్.నవీన్‌కుమార్, ఎన్.డేవిడ్‌రాజు, కె.రాణిరత్నకుమారి పాల్గొన్నారు.

3నుంచి దివ్యలీలా కల్యాణోత్సవం

ఎంఎల్‌సి జయమంగళకు ఆహ్వానం

ప్రజాశక్తి - మండవల్లి

మండలంలోని లింగాల శ్రీగంగా విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో వచ్చేనెల మూడు, నాలుగు, ఐదు తేదీల్లో నిర్వహించే దివ్యలీలా కల్యాణోత్సవంలో పాల్గొనాలని శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణకు ఆలయ ఇఒ సింగనపల్లి శ్రీనివాసరావు, ఛైర్మన్ రాజులపాటి యశోదనరావు ఆదివారం ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి మాట్లాడుతూ దైవ కార్యక్రమాల్లోనూ ప్రతిఒక్కరూ పాల్గొనాలని సూచించారు. అత్యంత వైభవంగా కల్యాణం నిర్వహించాలన్నారు. కళ్యాణం తిలకించేందుకు వచ్చే యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని ఆయన ఇఒకు సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త ఓలేటి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు

రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు - దేవులపల్లి ఆర్అండ్‌బి రహదారి గొల్లగూడెం వద్ద గతుల రోడ్డుకు స్టోన్‌వెట్ మిక్చర్ డస్ట్‌ను ఆదివారం వేశారు. రెండు నెలల క్రితం గోపీనాథపట్నం నుంచి నల్లమాడు మధ్య ఆధ్వాన్నంగా ఉన్న రోడ్డుకు రూ.15 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. అయితే గొల్లగూడెం సమీపంలో వెట్‌మిక్సర్ వేయకుండా మెటల్ వేసి ఆ పనులు ఆపేశారు. దీంతో వాహనాలు వెళ్తుంటే దుమ్ము రేగి వెనక వచ్చే వాహనదారులకు దారి కనిపించడం లేదు. ఈ క్రమంలో ఐదు లారీల్లో స్టోన్ డస్ట్‌ను అధికారులు తీసుకువచ్చి కూలీలతో పరిచారు.




మరమ్మతు పనులు చేస్తున్న కూలీలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - ఉంగుటూరు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు దాటి ఆరో సంవత్సరంలోకి ప్రవేశించిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించేందుకు అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉంగుటూరు మండలంలో చేబ్రోలు, ఉంగుటూరు, బాదంపూడి సెక్టార్లలో 315 మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివేందుకు అర్హత సాధించారని ఐసిడిఎస్ పర్యవేక్షకులు తెలిపారు. వీరంతా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బదిలీ సర్టిఫికెట్లను అంగన్‌వాడీ కార్యకర్తలు సిద్ధం చేస్తున్నారు.




రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రముఖులు

సెయింట్ జోసఫ్ యూత్ రక్తదానం

ప్రజాశక్తి - ముసునూరు

రక్తదానమంటే ప్రాణదానమేనని ముసునూరు సర్పంచి కొండేటి విజయలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ జోసఫ్ చర్చి 40వ వార్షికోత్సవంలో భాగంగా ఏలూరు గుడ్ సమరిటన్ కేన్సర్ అండ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో సెయింట్ జోసఫ్ యూత్ సుమారు 69 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎం.కుటంబరావు, బిసి నాయకులు తులిమెల్లి రంగారావు, గ్రామపెద్దలు లోకేశ్వరరావు, కొండేటి బాబి, గారపాటి నరసింహారావు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న దాత

చినవెంకన్న అన్నదాన ట్రస్ట్‌కు రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్ట్‌కు పశ్చిమగోదావరి జిల్లా జట్లపాలేనికి చెందిన షణ్ముఖ ఆటో ఫైనాన్స్ నూజివీడు అధినేతలు కోడూరి వీర రాఘవులు కుమారులు విజయ్‌కుమార్, అజయ్‌కుమార్ రూ.10,01,116 విరాళం ఆదివారం అందించారు. ఆలయ ఇఒ వేండ్ర త్రినాధరావుకు విరాళానికి సంబంధించిన డిడిని అందజేశారు. గతంలో వారు శ్రీవారి ఆలయ ప్రాంగణం, అలివేటి మండపం, శ్రీవారి క్షౌర శాల భవనం, నిత్యాన్నదాన భవన ప్రాంగణాల పరిశుభ్రత కోసం రూ.10,40,000 విలువైన శానిటరీ క్లీనింగ్ మిషన్లు విరాళంగా అందజేశారు. దాతలకు శ్రీవారి తీర్థప్రసాదాలు, మెమెంటో ఇచ్చి అభినందించారు.

నేరాలు - ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా

నలుగురు మహిళా కూలీలకు గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో నలుగురు మహిళా కూలీలు గాయాలపాలైన ఘటన మండలంలోని కామయ్యపాలెంలో ఆదివారం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం స్వర్ణవారిగూడేనికి చెందిన కూలీలు రోజూమాదిరి జీలుగుమిల్లికి చెందిన రైతు కోలా ధర్మరాజుకు చెందిన పొగాకు కొట్టడానికి వచ్చారు. తోటలో ఆకు కొట్టుకుని బ్యారన్ వద్దకు వెళ్తుండగా కామయ్యపాలెం శివారులో ఎదురుగు వస్తున్న కారును తప్పించబోయి ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ఘటనలో నలుగురు మహిళా కూలీలకు గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను స్థానిక పిహెచ్‌సికి తరలించారు. గాయపడిన వారిలో తడికమళ్ల వెంకాయమ్మ కాలుకు తీవ్రగాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

చెట్టు కూలి గేదె మృతి

ప్రజాశక్తి - ముసునూరు

ఈదురు గాలుల వర్షానికి గేదెపై తాడిచెట్టు కుప్పకూలడంతో మరణించిన ఘటన మండలంలోని గుడిపాడులో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలో ఆదివారం ఉదయం భారీవర్షం కురిసింది. ఈ వర్షానికి గుడిపాడుకు చెందిన మందలపు ప్రసాద్‌కు చెందిన గేదెపై పడటంతో సుమారు రూ.80 వేలు విలువైన గేదె చనిపోయింది. దీంతో ఆ కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాన్ని ఆదుకోవాలని టిడిపి నాయకులు రఘుబాబు కోరారు.



దగ్ధమవుతున్న ట్రాక్టర్

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

యలమంచిలి: విద్యుత్‌వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైన సంఘటన చించినాడలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక చించినాడ సొసైటీ వద్ద నుండి గ్రామానికి వెళుతున్న గడ్డి ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగలడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో గడ్డి ట్రాక్టర్‌పైన ఉన్న వ్యక్తి వెంటనే కిందకు దూకేశాడు. అనంతరం ట్రాక్టర్ డ్రైవర్ లోడును పైకి ఎత్తి ట్రక్కు నుండి ఇంజన్‌ను వేరు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అయితే రూ.పది వేల ఖరీదైన గడ్డి దగ్ధమైందని రైతు శ్రీనివాసరాజు ఆవేదన వ్యక్తం చేశారు.

కలిసిపూడిలో చోరీ

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని కలిసిపూడిలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఉప్పల లక్ష్మీనారాయణ కుటుంబం ఉండి గ్రామంలోని పోలేరమ్మ జాతరకు వెళ్లింది. అర్ధరాత్రి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటిమెస్ తాళం తీసి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూశారు. బీరువాలో ఉండాల్సిన ఐదు కాసుల బంగారు వస్తువులు, 17 తులాల వెండి, రెండు జతల వెండి పట్టీలు, రూ.లక్ష నగదు చోరీకి గురైందని గుర్తించారు. వెంటనే లక్ష్మీనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కె.గంగాధర్‌రావు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడి మరణం తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య

ఉండి: కుమారుడి మృతిని తట్టుకోలేక మనస్తాపంతో పురుగుల మందు తాగి తండ్రి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని చిలుకూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిలుకూరు గ్రామానికి చెందిన ముదునూరి రామకృష్ణంరాజు చిన్న కుమారుడు ముదునూరి వీర్రాజు రెండు నెలల క్రితం కేన్సర్‌తో మృతిచెందాడు. అప్పటి నుండి మనస్తాపంతో కుంగిపోతున్న తండ్రి ఏప్రిల్ 26వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బంధువులు గమనించి భీమవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. మృతుని భార్య తులసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.గంగాధర్‌రావు తెలిపారు.

కనులవిందుగా.. హేలాపురి వేసవి ఉత్సవం




మండువేసవిలో అందరినీ ఆహ్లాదపరుస్తూ వేసవి తాపాన్ని మైమరిపించేలా హేలాపురి వేసవి ఉత్సవం కనులవిందుగా సాగింది. ఏలూరు నగరంలోని గవరవరంలో సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో తొలి హేలాపురి వేసవి ఉత్సవ కార్యక్రమాలు ఆదివారం సందడి.. సందడిగా సాగాయి. ఈ ఉత్సవాలను ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ప్రారంభించగా ప్రారంభ సభకు హేలాపురి వేసవి ఉత్సవం అధ్యక్షుడు కస్తూరి రావు అధ్యక్షత వహించారు. హేలాపురి వేసవి ఉత్సవంలో ఎల్‌కెజి, యుకెజి పిల్లలు మొదలుకుని సీనియర్ సిటిజన్లు, 60 సంవత్సరాలు పైబడిన వారు ఎంతో ఆనందంగా వివిధ పోటీల్లో పాల్గొన్నారు. దీనికితోడు మధ్యాహ్నం వాతావరణం కూడా చల్లబడటంతో ఉత్సవాలు ఆహ్లాదకర వాతావరణంలో సాగాయి.


వేదికపై అతిథులు, ప్రముఖులు, నిర్వాహకులు


పోటీలను పర్యవేక్షిస్తున్న ఎంఎల్‌సి, నిర్వాహకులు


కోలాటంలో భాగస్వాములైన ఎంఎల్‌సి సాబ్జీ


వేసవి ఉత్సవంలో పాల్గొన్న చిన్నారులు


హాజరైన చిన్నారులు, తల్లిదండ్రులు, ప్రజలు

ఉపాధి హామీని పరిరక్షించాలని 12న ధర్నా

ఎపి వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి

ప్రజాశక్తి - నరసాపురం రూరల్

ఉపాధి హామీ పరిరక్షణకు ఈ నెల 12న భీమవరం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను, మోటార్ సైకిల్ ర్యాలీలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పిలుపునిచ్చారు. ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం స్థానిక మీరా గ్రంథాలయంలో జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి అధ్యక్షతన జరిగింది. రవి మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీకి కేటాయింపులు బడ్జెట్లో సగం కోత విధించారన్నారు. కేవలం రూ.63 వేల కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల ఫలితంగా గ్రామాల్లో కూలీలందరికీ ఉపాధి హామీ పనులు కీలకంగా మారాయని, నిధులు పెంచాల్సిందిపోయి తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకపక్క నిధులు తగ్గించి, మరోపక్క ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్తర్లు వేసే విధానం కూలీలకు శాపంగా మారిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు మాట్లాడుతూ ఒకపక్క నిత్యావసర వస్తువులతోపాటు గ్యాస్, పెట్రోల్, డీజిల్ వంటి ధరలు పెంచి బడ్జెట్లో కూలీలకు కోత విధించడం ఏమిటని ప్రశ్నించారు. ఊరి శివార్లలో నెట్‌వర్క్ లేక సిగ్నల్ అందక సైట్ సూపర్‌వైజర్లు స్మార్ట్‌ఫోన్ల ద్వారా మస్తర్లు వేయటం ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పద్ధతిలోనే మస్తర్లు వేయాలని, పేస్లిప్‌లు ఇవ్వాలని, కనీస వేతనం రూ.600 ఇచ్చి 200 రోజులు పని దినాలు కల్పించాలని, పనిముట్లు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నేతలు బల్ల చినవీరభద్రరావు, కండెల్లి సోమరాజు, జె.వెంకటలక్ష్మి, ఎస్.అసిరియ్య, షేక్ పాదుషా, గుబ్బల నాగేశ్వరరావు, యడ్ల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు క్షేత్రస్థాయి పర్యవేక్షణాధికారులు

రెండు వారాల్లో 83,240 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

రైతుల ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్

జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో రబీ ధాన్యం సేకరణ లక్ష్యం రెండు లక్షల మెట్రిక్ టన్ను లని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. ఇప్పటివరకు రూ.160 కోట్లు విలువైన 78,497 మెట్రిక్ టన్నుల ధాన్యం 6,647 మంది రైతుల నుంచి సేకరించినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 25 లక్షలు గోనె సంచులను రైతులకు అందజేశామని తెలిపారు. రోజుకు సుమారు 450కు పైగా లారీలను ఏర్పాటుచేస్తూ సగటున 10 నుండి 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిమిత్తం మండలాలవారీగా ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ముదినేపల్లి, మండవల్లి మండల్లాలో రైతుల వద్ద మిగిలి ఉన్న ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ఆదేశాలొచ్చాయని తెలిపారు. రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించేందుకు జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్ నెంబర్లు 08812-230448, 7702003584, 7569562076, 7569597910, 8500730430 అని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎటువంటి ఆందోళనా చెందొద్దని లావణ్య వేణి కోరారు.

మేడే స్ఫూర్తితో.. కార్మిక చట్టాల అమలుకు పోరు



ఉమ్మడి పశ్చిమగోదావరి వ్యవసాయక జిల్లాగా ఉన్నప్పటికీ ఏలూరు ఉంగుటూరు, భీమడోలు, జంగారెడ్డిగూడెం, పెదవేగి, ద్వారకాతిరుమల, నూజివీడు, ఆగిరిపల్లి, ముదినేపల్లి, తాడేపల్లిగూడెం, తణుకు ప్రాంతాల్లో చెప్పుకోదగ్గ పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో సైతం ఇతర రాష్ట్రాల వలస కార్మికులు వేల సంఖ్యలో పని చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు, గుండుగొలను-కొవ్వూరు హైవే పనుల్లో వేలాది మంది ఉత్తరాది రాష్ట్రాల వలస కార్మికులు పని చేస్తున్నారు. భీమవరం ప్రాంతంలో ఉన్న ఆక్వా పరిశ్రమల్లోనూ ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళలు పెద్దసంఖ్యలో పని చేస్తున్నారు. స్థానిక కార్మికులు తక్కువగా ఉన్నారు. పని చేస్తున్న కార్మికులు కూడా డైలీ వేజ్, క్యాజువల్, సివిల్, ట్రెయినీ, కాంట్రాక్ట్ పేరుతో అత్యధిక శాతం మంది ఉన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, ఒటి వంటి కనీస కార్మిక చట్టాలు కూడా అమలు కావడం లేదు. అయితే ఎక్కువ పరిశ్రమల్లో ఏ కార్మిక సంఘాలూ లేవు. పారిశ్రామిక కార్మికులకు కనీస వేతనాలు పెంచకపోవడం వల్ల వేలాది మంది కార్మికులు నష్టపోతున్నారు. జిల్లాలో అసంఘటితరంగ కార్మికులు లక్షలాది మంది ఉన్నారు. భవన నిర్మాణం, ఆటో, ట్రాన్స్‌పోర్ట్, హమాలీ, షాప్స్, మాల్స్, విద్యా సంస్థలు, హాస్పిటల్స్ రంగాల్లో లక్షలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. కరోనా నేపథ్యంలో ప్రభుత్వ విధానాల వల్ల భవన నిర్మాణం, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు పనుల్లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. షాప్స్-మాల్స్, ప్రయివేట్ విద్యా సంస్థలు, హాస్పిటల్స్‌లో వేలాది మంది కార్మికులు ఉద్యోగ భద్రత లేకుండా కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు లేకుండా జీవిస్తున్నారు.

నాలుగు సంవత్సరాల క్రితం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ప్రారంభంలో నవరత్నాలు అమలు పేరుతో సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నట్లుగా కన్పించింది. మున్సిపల్, ఆశా, అంగన్‌వాడీ, యూనిమేటర్ల వేతనాలు పెంచడం, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం, సిపిఎస్ రద్దుకు కమిటీని నియమించడం వంటి చర్యల వల్ల సానుకూల వాతావరణం కన్పించింది. అయితే ఆ తర్వాత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు జిల్లాలోని వివిధ రంగాల కార్మికుల్లో అభద్రతాభావాన్ని పెంచాయి. వైసిపి అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ పర్మినెంట్ అవుతామని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అది నెరవేరలేదు. ఇక ఉద్యోగులు ప్రభుత్వ విధానాలకు నిరసనగా పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ఈ కాలంలో ఆశాలు, అంగన్‌వాడీలు, రెండో ఎఎన్‌ఎంలు, మిడ్డేమీల్స్ వర్కర్లు, పశుసఖిలు, మీసేవ, గోపాలమిత్ర, యూనిమేటర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తదితరులు పోరుబాట పట్టారు. సిపిఎస్‌ను రద్దు చేస్తానని నాడు ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని కోరుతూ గత సెప్టెంబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు విజయవాడలో కదంతొక్కారు. అప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై నిరంకుశంగా.. కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. చిరుద్యోగులు, స్కీమ్ వర్కర్లు తమ ఉద్యోగాలు కాపాడుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను ప్రభుత్వాలు దారి మళ్లించడం వల్ల పరిహారాలు రాక కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. కార్మిక శాఖలో వందలాది ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల కార్మికులు నష్టపోతున్నారు. మరోవైపు సమస్యలపై ఉద్యమిస్తున్న కార్మికులను అణిచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోంది. ధర్నాలు, ప్రదర్శనలకు అనుమతి ఇవ్వకుండా నియంతృత్వ ధోరణిలో ప్రభుత్వ వైఖరి ఉంది. అన్ని రంగాల కార్మికులను అర్ధరాత్రి అరెస్ట్‌లు చేయడం, ఇళ్ల వద్ద నిర్బంధించడం వంటి చర్యలకు దిగుతూ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు.

జిల్లాలో వివిధ పరిశ్రమల్లో, పని ప్రాంతాల్లో కార్మికులు ప్రమాదవశాత్తూ మరణిస్తే సిఐటియుగా స్పందించి కార్మిక కుటుంబాలకు నష్టపరిహారం కోసం ఆందోళన చేస్తున్నాం. ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం పోరస్ కెమికల్ పరిశ్రమలో ప్రమాదం జరిగి 10 మంది కార్మికులు మరణించారు. ఆ కార్మికులకు న్యాయం చేయాలని, నష్ట పరిహారం ఇవ్వాలని సిఐటియుగా ఆందోళన నిర్వహించాం. జిల్లా కలెక్టర్ రూ.25 లక్షల నష్టపరిహారం ప్రకటించారు. రూ.కోటి ఇవ్వాలని ఆందోళన చేయగా రూ.50 లక్షలు ప్రకటించారు. తాడేపల్లిగూడెం ఫుడ్‌ఫ్యాట్స్‌లో చోటుచేసుకున్న ప్రమాదంలో ఒక కార్మికుడు సజీవ దహనమయ్యాడు. సిఐటియుగా చేసిన కృషి ఫలితంగా రూ.50 లక్షలు పరిహారం ఇచ్చారు. తర్వాత జరిగిన ప్రమాదంలో మహిళ మృతి చెందగా మెరుగైన పరిహారం సాధించాం. లక్కవరం రైతు డెయిరీ పరిశ్రమలో ప్రమాదం జరిగి మహిళ కార్మికురాలు చనిపోయారు. ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రి వద్ద సిఐటియుగా ఆందోళన నిర్వహించిన ఫలితంగా రూ.ఎనిమిది లక్షలు పరిహారం ఇచ్చారు. వర్క్‌మెన్ కాంపెన్సేషన్ కింద ఫిర్యాదు చేస్తే మరో రూ.7.60 లక్షలు కార్మికుల కుటుంబానికి చెల్లించారు. ఈ కాలంలో భీమడోలు ఏరియా పరిశ్రమల్లో, తిరుమల డెయిరీ, సగ్గొండ ఆంధ్రా షుగర్స్‌లో, పోలవరం ప్రాజెక్టు వర్క్‌లో పని చేస్తూ మరణించిన కార్మికులకు ఆందోళనల ఫలితంగా నష్టపరిహారాలు ఇప్పించాము. రుద్ర టెక్నోఫీడ్ పరిశ్రమలో ప్రమాదం జరిగి కార్మికుడు కాలు కోల్పోతే ఆందోళనలు చేసి నష్టపరిహారం ఇప్పించేందుకు ఆందోళన నిర్వహించాం. నూజివీడు శ్రీనివాసా ఫీడ్ ప్లాంట్‌లో ప్రమాదం జరిగి కార్మికుడు చనిపోతే ఆందోళన చేసి రూ.25 లక్షలు నష్టపరిహారం ఇప్పించాం. ద్వారకాతిరుమల దేవస్థానంలో మహిళా కాంట్రాక్ట్ కార్మికురాలు కేన్సర్‌తో అనారోగ్యానికి గురైతే కాంట్రాక్టరుతో మాట్లాడి రూ.1.50 లక్షలు నష్టపరిహారం ఇప్పించాం. భీమడోలు విజయ డెయిరీని రాష్ట్ర ప్రభుత్వం గుజరాత్‌కు చెందిన అమూల్ కంపెనీకి లీజుకి ఇచ్చింది. విజయ డెయిరీలో పనిచేస్తున్న 80 మంది కాంట్రాక్ట్ కార్మికులను అన్యాయంగా తొలగించారు. నిరంతరం ఆందోళనలు నిర్వహించాం. ఏలూరు జ్యూట్‌మిల్లును యాజమాన్యం 2022 జనవరిలో మూసేసింది. మూడు వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకున్న దాఖలాల్లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్లు నిర్వీర్యమయ్యాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో యాజమాన్యాలకు వంతపాడుతున్నాయి. ఫలితంగా ఈ కాలంలో జిల్లాలో సుమారు 10 పరిశ్రమల్లో భారీ ప్రమాదాలు జరిగి సుమారు 20 మంది కార్మికులు చనిపోయారు. మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చేందుకు ఉవ్విళ్లూరుతోంది. కార్మిక చట్టాల స్థానంలో లేబర్ కోడ్స్ అమలైతే కార్మికుల జీవితాలు మరింత దుర్భరమవుతాయి. షాపింగ్‌మాల్స్ సంఖ్య క్రమంగా పెరుగుతుంది. వీటిలో పని చేసే మహిళలు రోజు 10 నుంచి 12 గంటల పాటు నిలబడి పని చేయాల్సిన దుస్థితిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో మేడే స్ఫూర్తితో కార్మిక చట్టాల అమలుకు.. కార్మిక హక్కుల సాధనకు అంతా నడుం బిగించాలి. మేడే ఆ రోజున ఆ విధంగా ప్రతిజ్ఞ బూని కార్మిక, కర్షక ఐక్యతతో ఐక్య ఉద్యమాలు ఉధృతం చేద్దాం.

- డిఎన్‌విడి.ప్రసాద్,
సిఐటియు రాష్ట్ర కార్యదర్శి

నేడు కైకలూరులో జిల్లాస్థాయి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లా జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం కైకలూరులోని ఏలూరు రోడ్డులో ఉన్న సిఎన్ఆర్ గార్డెన్ కళ్యాణ మండపంలో మే ఒకటో తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి స్పందన కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులు అందరూ హాజరై అర్జీలను స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో, జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోను 'స్పందన' కార్యక్రమం యధావిధిగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తారని తెలిపారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి భౌతిక దూరం పాటించాలని కోరారు.



వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల చినవెంకన్న వైశాఖమాస బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామివారు అమ్మవార్లను నిత్యకళ్యాణ మండపంలో పెళ్లి కొడుకు, పెళ్లి కుమార్తెలుగా అలంకరించారు. మొదట విశేష అలంకరణ చేసి, మేళతాళాలు మంగళవాయిద్యాలతో, అర్చకులు వేదమంత్రాలతో ఈ కార్యక్రమాన్ని కన్నులపండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద విద్యార్థులు, అర్చకులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి వేండ్ర త్రినాథరావు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పెంటపాడు

మేడేను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపురపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి తెలిపారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బ్రిటీష్ వారి కాలంలో సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. ఈ చర్యలను నిరసిస్తూ మండలంలో మేడే వాడవాడలా జరపనున్నట్లు తెలిపారు. ఈ మేరకు గాంధీ బొమ్మ సెంటర్ నుండి వందల మందితో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తారని తెలిపారు. సభలో కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాదాసు శీను, కొయ్యన చంటి, బంకురు అక్కయ్య, బర్ల బాలాజీ, పెనగంటి దుర్గ పాల్గొన్నారు.

పెనుమంట్ర : బ్రాహ్మణచెరువు, మార్టేరు సెంటర్లో మేడే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజా సంఘాలకు సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు వాకపల్లి వెంకటరత్నం (గాంధీ), కోడే శ్రీనివాస ప్రసాద్ ఆదివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. బ్రాహ్మణచెరువులో నాయకులు ఆకుల హరే రామ్, బత్తుల విజయకుమార్ బృందం, మార్టేరు సెంటర్లో కూసంపూడి సుబ్బరాజు బృందం కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

తణుకురూరల్ : మేడే రోజు జెండాల ఆవిష్కరణ, మహా ప్రదర్శన, బహిరంగ సభలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎన్. ఆదినారాయణ బాబు, గుబ్బల గోపి, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విజ్ఞప్తిచేశారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో సిఐటియు ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్, బాబు, గోపి మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా కార్మికులకు ఎలాంటి ఉపయోగమూ లేదన్నారు. మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసిందని, ఈ విషయంలో వామపక్షాలు మినహా అన్ని పార్టీలూ పార్లమెంట్‌లో మద్దతివ్వడం సిగ్గుచేటని విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలన్నారు. పెరుగుతున్న ధరలతో కార్మికులు జీవనం దుర్భరంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో పి.దక్షిణామూర్తి, ఎం.గోవిందరాజు, వైటి.రామకృష్ణ, కిల్లి.నాయుడు, వంశీ వెంకటేశ్వరరావు, చిన్నారావు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు పట్టణం మేడే ఉత్సవాలు నిర్వహించేందుకు ముస్తాబవుతోంది. సిపిఎం పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ సారథ్యంలో పట్టణంలోని ముఖ్య కూడళ్ల గాంధీ బొమ్మ సెంటర్, పాత బస్టాండ్, యడ్ల బజార్, పార్టీ ఆఫీసు వద్ద అరుణ పతాకాలు రెపరెపలాడుతున్నాయి. సోమవారం ఉదయం పార్టీ ఆఫీసు నుండి ర్యాలీగా బయలుదేరి పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తారు. దీనిలో వివిధ కార్మిక, ఉద్యోగుల సంఘాలు, మహిళా సంఘాలు పాల్గొంటాయి. టిడిపి కూడా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో రిక్షాలతో భారీ ఊరేగింపు నిర్వహిస్తారు.

ప్రతిచోటా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గణపవరం

వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చే చలివేంద్రాలు ప్రతిచోటా ఏర్పాటు చేయాలని గణపవరం కన్యాకాపరమేశ్వరి వర్తక సంఘం భవనం అధ్యక్షులు ఆర్‌విఎస్.రాజు, అన్నపూర్ణమ్మ దంపతులు అన్నారు. ఆదివారం కన్యాకాపరమేశ్వరి జయంతి సందర్భంగా వర్తక సంఘం భవనం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏటా అమ్మవారి జయంతి రోజు చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. చలివేంద్రాన్ని వేసవి వెళ్లే వరకూ కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు వంకాయల రామారావు, కార్యదర్శి నడంపల్లి రాంపండు, మానవతా నాయకులు పాల్గొన్నారు.

వైసిపి పాలనపై అసంతృప్తి

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజలు టిడిపి వైపు మక్కువ చూపుతున్నారని పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొత్తూరు రామరాజు అన్నారు. ఆదివారం జెట్టిపాలెంలో రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలతో మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనతో అన్ని వర్గాల ప్రజలూ తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, జెట్టిపాలెం గ్రామ అధ్యక్షులు బొక్క సత్యనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జి కుక్కల చిట్టిబాబు, బూత్ కన్వీనర్ కట్ట నాగూర్, క్లస్టర్ కొల్లాటి బాలకృష్ణ, గుబ్బల సత్యనారాయణ, కట్టా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రతి ఒక్కరికీ విద్యతో పాటు క్రీడలు ఎంతో దోహదపడతాయని మాజీ డిఇఒ ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. కోపల్లె హైస్కూల్లో మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. డాక్టర్ దంతులూరి విజయరామరాజు మెమోరియల్ రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్‌కు ఆరు వాలీబాల్ జిల్లా జట్లు వచ్చాయి. కృష్ణాజిల్లా మొదటి స్థానం సాధించింది. పశ్చిమగోదావరి జిల్లా రెండో స్థానం, విజయనగరం జిల్లా మూడో స్థానం, శ్రీకాకుళం జిల్లా నాలుగో స్థానం, 5వ స్థానం ఆర్ఐఎన్ఎల్ వైజాగ్, ఆరో స్థానం ఎస్‌పిఆర్ భీమవరం జట్టు సాధించాయి. వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాళ్ల జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, పి.విశ్వనాధరాజు, వి.రామరాజు, దత్తాత్రేయ వర్మ, ప్రధానోపాధ్యాయులు కె.సత్యనారాయణ మూర్తి, కొత్తపల్లి బంగారాజు, గాదిరాజు కనకరాజు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు, యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు, ఆలయ సిబ్బంది , ఏర్పాట్లు చేశారు.

నేడే మేడే

(మొదటి పేజీ నుంచి)

కాలరాసేలా ప్రభుత్వాలు నిర్బంధానికి తెగబడుతున్నాయి. చట్టాలను నిర్వీర్యం చేయడంతోపాటు హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న కార్మికులపై నిర్బంధం అనూహ్యంగా పెరిగిపోయింది. కనీసం నిరసన తెలిపే అవకాశం సైతం లేకుండా గృహనిర్బంధాలు చేస్తున్నారు. హక్కుల కోసం ప్రశ్నించే కార్మికులపై యాజమాన్యాలు కక్ష సాధింపులకు దిగుతున్నాయి. భీమవరం గ్యాస్ డెలివరీ కార్మికులు, చింతలపూడి ప్రాంతంలోని ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ, తణుకులో ఎపి సీడ్స్ కార్మికుల హక్కుల కాలరాసే ఘటనలే దీనికి నిదర్శనం. బిజెపి అధికారంలోకొచ్చాక కార్మికుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఈ నేపథ్యంలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీస్తూ.. ఈ ప్రభుత్వాల విధానాలు మారాలని నినదిస్తూ మేడే ఉత్సవాల్లో కార్మికులంతా రెట్టించిన ఉత్సాహంతో కదంతొక్కేందుకు సిద్ధమయ్యారు.

ఆగని వర్షం.. ఆందోళనలో రైతాంగం

చల్లబడటంతో సేదతీరారు. వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో పిల్లలు, యువకులు కేరింతలు కొట్టారు.

నూజివీడు రూరల్: మండలంలో పోతిరెడ్డిపల్లి, దిగవల్లి, దేవరగుంట, జంగంగూడెం తదితర గ్రామాల్లో ఆదివారం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. అకాల వర్షాలు కురవడంతో మామిడి, అరటి, మొక్కజొన్న రైతులకు భారీ నష్టం వాటిల్లింది. అకాల వర్షాలతో నష్టపోతున్న తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

చింతలపూడి: అకాల వర్షంతో మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొలాల్లో ఉన్న మొక్కజొన్న పంటపై పరదాలు, బరకాలు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేశారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన మోడల్ ఎంసెట్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శశి ఇంజినీరింగ్ కాలేజీలో మోడల్ ఎంసెట్ ఆన్‌లైన్ పరీక్ష ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షకు సుమారు 350 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి టి.రవిబాబు, మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో అత్యున్నత స్థాయిలో ఉండాలన్నారు. ఎస్ఎఫ్ఐ పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. విద్యార్థులు ఎన్నుకునే రంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.

దేశాలమ్మకు కిలో వెండి బహూకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు శ్రీదేశాలమ్మ అమ్మవారికి కాకినాడకు చెందిన బ్లూపార్ట్ హేచరీ యాజమాని కటికి వెంకట్ దంపతులు కిలో వెండిని ఆదివారం బహూకరించారు.ఈ సందర్భంగా ఆలయంలో వెంకట్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మే 5వ తేదీ నుంచి దేశాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారికి వెండి బహూకరించారు.

సెలవుల్లో పుస్తకాలు చదవించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పెనుమంట్ర హైస్కూల్ హెచ్‌ఎం కె.సాయి సూర్యనారాయణరావు తెలిపారు. ఆదివారం హైస్కూల్లో ఉపాధ్యాయ, పేరెంట్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం కె.సాయి సూర్యనారాయణరావు మాట్లాడారు. రాబోయే విద్యా సంవత్సరంలో జగనన్న విద్యా కానుక యూనిఫామ్‌తో విద్యార్థులందరూ బడికి వచ్చేలా చూడాలన్నారు. సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయ పుస్తకాలను చదివించి, వాటి ప్రాముఖ్యతను తెలుసుకొని ముఖ్యాంశాలను రాసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ద్వారంపూడి నాగిరెడ్డి, వైస్ ఛైర్మన్ మేడపాటి లక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాలు

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మహిళలు 108 కళాశాలతో గ్రామోత్సవం నిర్వహించి, అనంతరం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కనకర్ల గాంధీ, కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, అద్దేపల్లి శ్రావణి, వరలక్ష్మి, లత, చంద్రిక, ఉష, ప్రియ, పద్మ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గూడెం శాఖా గ్రంథాలయంలో 40 రోజుల పాటు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు, జనరల్ సైన్సు, మ్యాథమెటిక్స్, సోషల్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే వేసవి సెలవుల్లో గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు చేసుకోవడంపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జి,బాపయ్యశర్మ, ఎన్.సల్మాన్ రాజు, ప్రత్తి వీరస్వామి, ఇంటి జయప్రద, సిహెచ్.వెంకట రత్నం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

రోడ్డు ప్రమాదంలో భార్య, భర్త ఇద్దరు పిల్లలు గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. పాలకోడేరు మండలం విస్సాకోడేరు వంకాయలపాలెంకు చెందిన కె.రాము, భార్య మాధురి, ఇద్దరు పిల్లలతో కలిసి ఇరగవరం మండలం కంతేరులో తమ బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం బైక్‌పై ఆదివారం బయలుదేరారు. బ్రాహ్మణచెరువు దాటి భట్లమగుటూరు సమీపంలో ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. దీంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 వాహనంలో తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పెనుమంట్ర : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని ముగ్గురు స్వల్ప గాయాల పాలైన సంఘటన గరువు ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అత్తిలి మండలం తిరుపతిపురానికి చెందిన రాపాక సూర్యప్రకాష్‌రావు వేసవి సెలవుల నేనథ్యంలో తన మేనకోడళ్లు నరాలశెట్టి లిఖిత, వర్షిణిని తీసుకుని బైక్‌పై పెనుగొండ మండలం రామన్నపాలెం బయలుదేరాడు. గరువు ప్రధాన రహదారికి వచ్చేసరికి వేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. దీంతో వారు కింద పడిపోయారు. అయితే కారు డ్రైవర్ మాత్రం ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో ముగ్గురికి స్వల్పంగా గాయాలయ్యాయి. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సూర్య ప్రకాష్‌రావు తెలిపారు.

ముగిసిన గ్రామ దేవతల ఉత్సవాలు

ప్రజాశక్తి - ఉండి

ఉండి గ్రామదేవతలు పోలేరమ్మ, వెంకమ్మ, మహంకాళమ్మ అమ్మవార్ల 60వ వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం రాత్రి కాళికాదేవి అవతారంలో నృత్యాలు, గరగ నృత్యాలు నిర్వహించారు. అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ చిక్కాల సత్య జగదీష్ ప్రసాద్ మాట్లాడుతూ అమ్మవారి 60వ వార్షికోత్సవంలో భాగంగా మే 3వ తేదీన అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అందరూ పాల్గొనాలని కోరారు.

కాళ్ల : కోపల్లెలోని కనకదుర్గమ్మ, పర్లమ్మ అమ్మవార్ల జాతర ఆదివారం నిర్వహించారు. ఎంఎల్ఎ మంతెన రామరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ డిసి ఛైర్మన్ తోట ఫణిబాబు, గ్రామ సర్పంచి బూడి నాగమణి, సత్యనారాయణ ఉప సర్పంచి బూడి వెంకటపరాలు, ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు భీమవరంలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి భీమవరం పట్టణ ఆధ్వర్యంలో ఈనెల ఒకటో తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు భీమవరం పట్టణం గునుపూడి, తాడేరు రోడ్డు 12వ వార్డు ఇందిరమ్మ కాలనీ వద్ద, సబ్‌స్టేషన్ వద్ద ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించనున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు ఇందుకూరు సుబ్రహ్మణ్యంరాజు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని టిడిపి కుటుంబ సభ్యులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

విమలారెడ్డికి సత్కారం

ప్రజాశక్తి - ఆచంట

కొడమంచిలి కాపులవీధిలోని ఏలిమ్ ప్రేయర్ హాల్ చర్చిలో జరుగుతున్న పనులను వైఎస్ విమలారెడ్డి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండలాని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. మొదటిసారి కొడమంచిలి గ్రామానికి విమలారెడ్డి రావడాన్ని హర్షిస్తూ పంచాయతీ నుండి చర్చి వరకూ ర్యాలీగా వెళ్లి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమెను సత్కరించారు.

చర్చి నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ఉండి

దాతల సహకారంతో కలిసిపూడిలో నిర్మిస్తున్న సిబిసిఎన్‌సి చర్చి నిర్మాణానికి కలిసిపూడి ఎంపిటిసి, మానవత మండల అధ్యక్షులు దంగేటి రామలింగేశ్వరరావు రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నిర్మిస్తున్న చర్చి స్లాబ్ దశలో ఉందని, దాతలు సహకరిస్తే నిర్మాణం వేగవంతం అవుతుందని తెలిపారు.

మహిళలపై ఎందుకింత కక్ష

ప్రజాశక్తి - పాలకొల్లు

టిడిపి హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు కనీసం 10 శాతం కూడా ఇవ్వలేదని, సిఎం జగన్‌కు మహిళలపై అంత కక్ష ఎందుకని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. ఆదివారం 31వ వార్డుకు చెందిన ఇరువురు వృద్ధులు తమకు ఇళ్లు రాలేదని ఎంఎల్ఎకు మొరపెట్టుకున్నారు. దీనిపై ఎంఎల్ఎ రామానాయుడు మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని కలెక్టర్ వద్ద కూడా పోరాటం చేశామని, అయినా ప్రభుత్వం స్పందించలేదని చెప్పారు. అసెంబ్లీ వరకు సైకిల్‌పై వెళ్లి పోరాటం చేసినా కనికరించలేదని విమర్శించారు. మౌలిక సదుపాయాలు పూర్తి చేయకుండా కేవలం వైసిపి రంగులు వేయడానికి రూ.కోట్లు వెచ్చించారని ఆరోపించారు. ఆఖరి లబ్ధిదారుడు టిడ్కో ఇళ్లలోకి వెళ్లే వరకూ తన పోరాటం ఆగదని ఎంఎల్ఎ స్పష్టం చేశారు.

విమలమ్మ కుటుంబానికి మాజీ మంత్రి రవీంద్ర పరామర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని 31వ వార్డు వడలవానిపేటలో తోటే విమలమ్మ మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం పరామర్శించారు. విమలమ్మ కుటుంబంతో సాన్నిహిత్యం ఉండడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, కర్నేన గౌరు నాయుడు, కడలి గోపి, జివి, పాలవలస తులసీరావు ఉన్నారు.




నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంఎల్ఎ నిమ్మల

అభివృద్ధి పనులకు పివిఎల్ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - కాళ్ల

ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేరిందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. బొండాడపేట గ్రామంలో ఆదివారం పలు అభివృద్ధి పనులను పివిఎల్ నరసింహరాజు ప్రారంభించారు. బొండాడపేటలో 6 సిమెంట్ రోడ్లు సుమారు రూ.38 లక్షలతో నిర్మించారు. నేరేడుగరువు ప్రాంతంలో జగనన్న కాలనీలో రూ.16 లక్షలతో ఏర్పాటు చేసిన 63 కెవి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. వడ్డిగూడెంలో రూ.40 లక్షలతో ప్రత్యేక పైపులైను ఏర్పాటు చేశారు. పివిఎల్ తాగునీటి పైపులు వదిలి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొండాడ పేట గ్రామ సర్పంచి గోళ్ల వెంకట సత్యనారాయణ, సీసలి గ్రామ సర్పంచి బి.ధనలక్ష్మి, జెడ్‌పిటిసి పి.సోమేశ్వరరావు, ఎంపిటిసి సత్యనారాయణ, పి.విశ్వనాధరాజు, మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, మన్నే నాగరాజు, ఎలక్ట్రికల్ ఎఇ పడమట రాంబాబు పాల్గొన్నారు.



జగనన్న కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న పివిఎల్ నరసింహరాజు

కనీస వేతనం అమలు చేయాలని విఆర్‌ఎల వినతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విఆర్‌ఎలకు కనీస వేతనం ఇవ్వాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు ఆదివారం ఆయన నివాసం వద్ద విఆర్‌ఎల సంఘం భీమవరం డివిజన్ అధ్యక్షులు బైపే వెంకట విజ్ఞాన పండు, తాడేపల్లిగూడెం మండల అధ్యక్షులు గుమ్మళ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి గ్రామ రెవెన్యూ కార్యాలయాల్లో సహాయకులుగా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యను పక్కన పెట్టి నెలకు రూ.10,500 మాత్రమే చెల్లిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. పెరిగిన నిత్యావసర ధరల దృష్ట్యా కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం ద్వారా విఆర్‌ఎల కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. గతంలో ఉమ్మడి జిల్లాలోని 17 మంది శాసన సభ్యులకు విన్నవించామని అన్నారు. వృద్ధాప్యంతో దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతూ విధులు నిర్వహిస్తున్న విఆర్‌ఎల వారసులుగా కొంతమంది పనిచేస్తున్నారని వారిని ప్రభుత్వం విఆర్‌ఎలుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం సభ్యులు నరసింహమూర్తి, శ్రీలక్ష్మీ, సామ్రాజ్యం, నక్కా సుబ్బారావు, రాణి,మధు, సువర్ణ రాజు.ధనరాజు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఎలు

జగన్‌ది అరాచక పాలన

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జగన్‌ది అరాచక పాలన అని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో పాత్రికేయుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనాసుర రక్త చరిత్ర జగన్ ఫోటోలను చించి వేశారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ క్రిమినల్ స్వభావం కలిగిన జగన్ తనతో ఉన్న వారిని ప్రలోభపెట్టి వారి చేత నేరాలు చేయించి చేతులు దులుపుకుంటాడని విమర్శించారు. అధికారం కోసం తన కుటుంబాన్ని వాడుకుని వదిలేశారని విమర్శించారు. ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ జగన్ తన తండ్రి మరణాన్ని వాడుకుని ఓదార్పు యాత్రలు చేసిన అధికారం రానందున అధికారం కోసం తన సొంత బాబాయిని హత్య చేయించారని ఆరోపించారు. తణుకు మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, నరసాపురం ఇన్‌ఛార్జి పొత్తూరు రామాంజనేయరాజు మాట్లాడుతూ జగన్‌ది అరాచక రాక్షస పాలన అన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, అంగన్‌వాడీ డ్వాక్రా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగని నారాయణమ్మ, రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంఎల్ఎచే సీసీ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకోడేరు

కుముదవల్లి గ్రామంలో నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు నిధుల నుంచి విడుదల చేసిన రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీ రఘురామకృష్ణంరాజు నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో టిడిపి విజయానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం), టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, నేతలు భూపతిరాజు శ్రీకృష్ణ వర్మ, ఎస్‌వికెఎల్.మధుసూదనరాజు, దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, మోటుపల్లి రామవరప్రసాద్, గుండాబత్తుల వెంకట నాగేశ్వరరావు, కొత్తపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ రామరాజు

చెన్నకేశవస్వామి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఉండి

ఉండి మండలం ఉప్పులూరు గ్రామంలో శ్రీ చెన్నకేశవ స్వామి ఉత్సవాలు ఆదివారం సాయంత్రం ప్రారంభించినట్లు ఆలయ పాలకమండలి ఛైర్మన్ యర్రా వెంకట సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నుండి మే నారో తేదీ వరకూ ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు నిమ్మల శేషగిరిరావు, యర్రా చెన్నకేశవరావు, వి.పద్మావతి, యర్రా మంగతాయారు, వడ్లమన్నాడు సాయి, పార్వతి, రాచర్ల సీత, కొనతం కష్ణమూర్తిదాసు, అర్చక బృందం పాల్గొన్నారు.



జిల్లా బధిర సమావేశానికి హాజరైన సంఘం సభ్యులు

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని జిల్లా బధిర సంఘం జిల్లా అధ్యక్షులు టి.రాము ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా బధిర సంఘం జనరల్ బాడీ సమావేశం ఆదివారం స్థానిక టూ టౌన్ రైల్వేలో స్టేషన్ వద్ద ఉన్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ వర్మ మాట్లాడుతూ జిల్లాలోని అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పోస్టుల్లో బధిరులకు 1 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలుకు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కాలపు సాయిలక్ష్మీ మాట్లాడుతూ వికలాంగులకు మరిన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఆమె కోరారు. సంఘం సభ్యులు సాయి లక్ష్మిని సత్కరించారు. సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి వంద మందికి పైగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్.శశికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్‌రెడ్డి, సి.తాతారావు, సిహెచ్ మహాలక్ష్మి పాల్గొన్నారు.



సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

పేరుపాలెం బీచ్ వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుండి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో, ఇసుక తిన్నెలపై ఆటలు ఆడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని, సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

వైఎన్‌లో మన్‌కి బాత్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ప్రధాని నరేంద్రమోడీ మన్‌కి బాత్ (మనసులో మాట) కార్యక్రమం నరసాపురం వైఎన్ కళాశాలలో ఆదివారం ఎల్‌సిడి ద్వారా నిర్వహించారు. ప్రధాని మోడీ ప్రసంగాన్ని విద్యార్థులు, ప్రజలు, మేధావులు, బిజెపి శ్రేణులు వీక్షించారు. సామాన్యులతో అనుసంధానానికి మన్ కీ బాత్ కార్యక్రమం వేదికైందని ప్రధాని ప్రసంగంలో తెలిపారు. ప్రజల్లోని భావోద్వేగాలను తెలుసుకునేందుకు అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు నారిన తాతాజీ, ప్రిన్సిపల్ ఎపివి అప్పారావు, నాయకులు పులపర్తి వెంకటేశ్వరరావు, మునికోటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డబ్బులడిగితే ఫిర్యాదు చేయండి

వ్యవసాయ శాఖ జెడి రామకృష్ణ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం తరలించేందుకు లారీల కోసం కోసం డబ్బులు అడిగితే రైతులు అధికారులకుగాని, కంట్రోల్ రూమ్‌కుగాని ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని వ్యవసాయ శాఖ జెడి రామకృష్ణ సూచించారు. ప్రజాశక్తి దినపత్రికలో ఈ నెల 30న ప్రచురితమైన 'డబ్బులు ఇస్తేనే లారీలు' కథనంపై అధికారులు స్పందించారు. ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మిల్లులను ఆన్‌లైన్ ద్వారా కేటాయిస్తున్నారని, రైతుభరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్, షెడ్యూలింగ్ చేయించుకున్న తర్వాత రైతులకు క్రమపద్ధతిలో ఆన్‌లైన్ ప్రక్రియలో లారీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. కాకపోతే వరితోపాటు మొక్కజొన్న, ఇతర పంటలు కూడా ఏకకాలంలో కోతకు రావడం వల్ల లారీల కొరత ఏర్పడిన విషయం వాస్తవమేనని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో లారీలను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో క్రమపద్ధతిలో షెడ్యూల్ ప్రకారం కేటాయిస్తున్నారని తెలిపారు. ఒకవేళ లారీలు పెట్టడానికి ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే సంబంధిత మండల వ్యవసాయ అధికారి లేదా జిల్లా వ్యవసాయ అధికారి వారికి లేదా జిల్లా కలెక్టర్ ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌కె.అలీముద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ విద్యామండలి కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల ఒకటో తేదీ నుండి 20వ తేదీ వరకూ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు స్థానిక జీలుగుమిల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

మేడే వేడుకలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మే డే వేడుకలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పోచమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు కొయ్యలగూడెం ప్రభుత్వాసుపత్రి వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మేడే జెండా ఆవిష్కరణ, అనంతరం సభ, ర్యాలీ నిర్వహిస్తున్నామని, మండలంలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గోడపత్రికలను విడుదల చేశారు. అనంతరం పోచమ్మ మాట్లాడుతూ కార్మికుల పోరాటం ద్వారా 16 గంటల పని విధానాన్ని ఎనిమిది గంటల పని దినంగా సాధించుకున్న మొదటి విజయంగా ఈ మేడే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ కార్మిక హక్కులను కుదిస్తున్న నేటి తరుణంలో ప్రపంచవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ వర్గాలు తిరుగుబాటు బావుట ఎగరవేస్తున్నాయని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి నిరసన తెలియజేస్తున్నాయని తెలిపారు. బడా పారిశ్రామికవేత్తలకు లాభాలు ఆర్జించి పెట్టటానికి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని మేడేను స్ఫూర్తిగా తీసుకుని కార్మికవర్గం ఒకటై ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయపూడి జగదాంబ, గోగులమ్మ పి.సుధారాణి. జి.కోమలి, నాగలక్ష్మి, రాణి, సుజాత, సుకన్య పాల్గొన్నారు.

పెదవేగి : కార్మికవర్గం ప్రాణ త్యాగాల ద్వారా సాధించుకున్న కార్మికచట్టాలను మోడీప్రభుత్వం సంపన్నుల కోసం మార్పులు చేయడం సిగ్గు చేటని, కార్మికచట్టాలను మేడే స్ఫూర్తితో సాధించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డివిఎన్‌విడి ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో మే డే పోస్టర్లను ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఒక పెట్టుబడిదారుల కోసం దేశ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టడం దుర్మార్గమన్నారు. కార్మిక - కర్షక వర్గం తమ రక్తాన్ని ధారపోసి సృష్టించిన సంపదను కొల్లగొట్టడం సిగ్గు చేటన్నారు. కార్మికవర్గానికి రక్షణగా ఉన్న 44 చట్టాలను కార్పొరేట్ల కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారన్నారు. రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేసిన బిజెపితో మన రాష్ట్రంలోని మూడు ప్రధానపార్టీలు అంటకాగుతున్నాయన్నారు. మేడే స్ఫూర్తితో బిజెపి నుంచి దేశాన్ని, ప్రజనీకాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం మేడే గోడపత్రికలను విడుదల చేశారు. పెదవేగి మండలంలో జరిగే మేడే జండా ఆవిష్కరణలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.ప్రసాద్, సుబ్బారావు, దుర్గారావు వెంకన్న పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: కార్మిక, కర్షకులు వేలాదిమంది ప్రాణత్యాగ ఫలితంగా సాధించుకున్న ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, పార్టీ ప్రజాసంఘాల నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మానవాళి విముక్తి కోసం చికాగో నగరంలో వేలాదిమంది కార్మికులు ప్రాణత్యాగం ఫలితంగా మేడే ఏర్పడిందని గుర్తు చేశారు.పోలవరంలో మేడే వేడుకల ఏర్పాట్లు పరిశీలించారు. మండలంలో సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జెండాలు ఎగురవేయాలన్నారు. బుట్టాయగూడెం రోడ్‌లోని పాత పంచాయతీ కార్యాలయం నుండి ఆర్‌టిసి బస్టాండ్ వరకూ ప్రదర్శన, అనంతరం బస్టాండు వద్ద సభ నిర్వహిస్తున్నామన్నారు.

రైతులకు సరిపడా సంచులు కూడా ఇవ్వలేరా

జిల్లా సమీక్షా సమావేశంలో అధికారులను, మంత్రులను ప్రశ్నించిన ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రైతు పండించిన ధాన్యానికి సరిపడా సంచులు కూడా ఇవ్వలేరా' అంటూ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) తనదైన శైలిలో కలెక్టర్ ప్రశాంతిని, రాష్ట్ర మంత్రులు కారుమూరి నాగేశ్వరరావును, కొట్టు సత్యనారాయణను నిలదీశారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన జిల్లా సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, జెడ్‌పి ఛైర్మన్ కె.శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి వెంకటేశ్వరరావు ప్రజా సమస్యలపై తన గళాన్ని కలెక్టర్, మంత్రుల ముందు గట్టిగా వినిపించారు. ముందుగా రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, తాను భీమవరం, పాలకొల్లు మండలాలకు వెళ్లినప్పుడు రైతులు తమ బాధను చెప్పారన్నారు. తమ ప్రాంతంలో అలాగే అసలు భూములు ఎన్ని ఉన్నాయి? ఎంతమంది రైతులున్నారు? అనేది లెక్కిస్తే కౌలురైతు కార్డుల మంజూరులో పొంతన లేదని విమర్శించారు. తణుకు సమీపంలోని ఎపి సీడ్స్‌లో కార్మికులను తొలగింపుపై ఆందోళన చేస్తే జట్టు కార్మికులకు టెండర్ పిలుస్తామని చెప్పారని, ఇది తాను ఎక్కడా వినలేదని, విడ్డూరంగా ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఈ విషయంలో తనకు ఎలాంటి ఫిర్యాదూ రాలేదని, లేబర్ అధికారులతో మాట్లాడుతానని చెప్పారు. అలాగే జగనన్న స్థలాల మట్టి పూడికపేరుతో కోర్టు స్టే ఉన్న చించినాడలోని పెరుగు భూముల మట్టి తరలిస్తారని ప్రశ్నించారు. దీనిపై ఆందోళన చేస్తున్న దళితులను అన్యాయంగా అరెస్టు చేస్తున్నారని, వాటిని ఆపాలని కోరారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ ఆ మట్టిని పాలకొల్లు, నరసాపురం ప్రాంతాల్లోని జగనన్న కాలనీలకు తరలిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారని, అయినా ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యావ్యవస్థ బలోపేతానికి నాడు-నేడు పేరుతో పాఠశాలను ఎన్నడూ లేని విధంగా ఎంతో అభివృద్ధి చేస్తున్నామని మంత్రులు వివరించారు. దీనిపై ఎంఎల్‌సి మాట్లాడుతూ ఒకటి, రెండు, మూడు తరగతుల స్కూళ్లను ఎందుకు మూసేశారని, ఆ చిన్నారులు విద్యకు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని, ఇదేనా తమరు చేసే అభివృద్ధిని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎంఎల్‌సికి, మంత్రుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ సమావేశంలో ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు, జెసి, ఆర్‌డిఒ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.